జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సిద్దిపేట
సోమవారం | 26 | జనవరి | 2026 | పేజీలు : 7





## మల్లన్నను దర్శించుకున్న హుజురాబాద్ ఎమ్మెల్యే



4 లో

## సిద్దిపేట మున్సిపల్లో బడ్జెట్ దారి మళ్లింపు




4 లో

## యువ జోష్

గ్రామాల ముఖచిత్రం మారుస్తున్న యువ సర్పంచ్లు



7 లో

# పుర పోరులో క్లీన్ స్వీప్

అన్నీ వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

అభివృద్ధిలో అగ్రగామిగా హుస్నాబాద్

రూ. 26 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పదేండ్లలో చేయలేని అభివృద్ధిని రెండేళ్లలో చేశాం

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, జనవరి 25 (ప్రజా జ్యోతి):- రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలని, తద్వారా మరింత బాధ్యతతో హుస్నాబాద్ అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మంత్రి హుస్నాబాద్ మున్సిపాలి టీ పరిధిలో ఆదివారం మిగతా 2లో..

# బోనమెత్తిన లష్కర్ వారం



### జనసంద్రమైన మల్లన్న జాతర
### వసతుల కల్పనలో విఫలమైన ఆలయ అధికారులు

కొమురవెల్లి, జనవరి 25 (ప్రజా జ్యోతి): ప్రసిద్ధి గాంచిన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారం లష్కర్ వారంగా పిలువబడే ఈ ఆదివారానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు అక్కడే బాస చేసి ఆదివారం తెల్లవారుజామున కోనేటి స్నానాలు ఆచరించి తండోప తండాలుగా క్యూలైన్లలో నిలబడి మిగతా 2లో..



# పుర పోరులో క్లీన్ స్వీప్





మొదటి పేజీ తరువాయి..

పర్యటించి, 26 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో గత పది సంవత్సరాలుగా చేయని అభివృద్ధి రెండు సంవత్సరాల్లో చేసి చూపించామని, మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసేలా కాంగ్రెస్ పార్టీనీ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ లో గత రెండేళ్లలో చేసిన అభివృద్ధి ఈ ప్రాంతం పట్ల, ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. హుస్నాబాద్ అంటే ఇట్టే గుర్తు పట్టేలా రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకొచ్చానన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలు, గతంలో జరిగిన పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్చిన మద్దతు ఫలితాల.మాదిరిగానే తాజాగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కూడా మద్దతు ఉండాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ – కరీంనగర్, హుస్నాబాద్ – అక్కన్నపేట మధ్య నాలుగు లైన్ ల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం చేస్తున్నామని ఇక్కడి ప్రజలకు 24 గంటలు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, పీజీ కాలేజీ రావడంతో పాటు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్ ఉండనున్నారని పేర్కొన్నారు. త్వరలోనే చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ వస్తుందని తెలిపారు.

### పట్టణ అభివృద్ధికి మరింత కృషి.. నిధులు మంజూరు...

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్త చెరువు అభివృద్ధికి రూ.7.79 కోట్లు, పల్లె చెరువు, ఎల్లమ్మ చెరువు కాలువల పునరుద్ధరణకు మరో రూ.3 కోట్లు రూపాయలతో శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు.

### కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం:-

హుస్నాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డు లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. గత వర్షాకాలంలో హుస్నాబాద్ లో 32 సెంటీమీటర్ల వర్షం పడితే డ్రైనేజీ సమస్య వచ్చిందనీ ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసు కున్నామన్నారు. హుస్నాబాద్ అభివృద్ధిలో కుల సంఘాల భవనాలు, మున్సిపాలిటీ సుందరీకరణ, అర్బన్ ఫారెస్ట్ ట్రెక్కింగ్, రాయికల్ వాటర్ ఫాల్స్, మహా సముద్రం గండి, భైరవ స్వామి గుడి టూరిజంగా మరింత అభివృద్ధి



చేస్తున్నామన్నారు. ఇండోర్ స్టేడియం వద్ద స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామని, మోడల్ స్కూల్ పక్కన ఉన్న ఖాళీ ప్రాంతంలో చిల్డ్రన్ పార్క్ కి శంకుస్థాపన చేసుకున్నామని సూచించారు. 4 కోట్ల రూపాయలతో దేవతల బావి, పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.హుస్నాబాద్ లో తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆరు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎలకతుర్తి జంక్షన్ అభివృద్ధి చేసుకున్నామని భీమదేవరపల్లి లో నవోదయ పాఠశాల తీసుకొస్తమని హామీ ఇచ్చారు.

### హుస్నాబాద్ ను కరీంనగర్ లో కలుపుతాం...

హుస్నాబాద్ ను కరీంనగర్ లో కలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని కచ్చితంగా హుస్నాబాద్ ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. అప్పటి ఎమ్మెల్యే సతీష్ బాబు హుస్నాబాద్ సిద్దిపేట జిల్లాలో కలుపుతుంటే చోద్యం చూసారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి మీ ఇంట్లో ఉండేవారనీ చెప్పుకునే సతీష్ బాబు హుస్నాబాద్ ప్రాంతానికి ఒక్క విద్యా సంస్థ అయిన తీసుకొచ్చారా, భవన నిర్మాణం పూర్తయిన డిగ్రీ కాలేజీ భవనం ఎందుకు షిఫ్ట్ చేయలేదని ప్రశ్నించారు. హుస్నాబాద్ లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తో ఏటిసి కి శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. హుస్నాబాద్ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి 20 ఎకరాల స్థలం త్వరలో కేటాయిస్తామని దానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇక్కడ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

### ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ:

గత 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదని ప్రజా పాలన ప్రభుత్వంలో తాము నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అవి పూర్తవుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో 500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని తమ ప్రభుత్వం అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు ఇస్తుందన్నారు. దేశంలో 29 రాష్ట్రాల్లో లేని సన్న బియ్యం పంపిణీ ఒక తెలంగాణ లోనే ఇస్తున్నామని చెప్పరు. హుస్నాబాద్ పట్టణంలో 80 శాతానికి పైగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. హుస్నాబాద్ లో రికార్డ్ స్థాయిలో వర్షం పడి ధాన్యం కొట్టుకుపోతే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేశామన్నారు. రిజర్వేషన్ల మార్పులో మంత్రులు, ఎమ్మెల్యేల, అధికారుల ప్రమేయం లేదన్నారు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి తాము రెండు సంవత్సరాల్లో చేసి చూపించమని ప్రకటించారు. హుస్నాబాద్ ప్రజలంత తనకి అండగా నిలబడి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# చేనేత కార్మికుల ను ఆదుకోవాలి

## సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్



సిద్దిపేట,జనవరి 26(ప్రజాజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ద్వితీయ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కాకినాడలో మహోత్సవం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం ఒక చేనేత వర్గానికి జీఎస్టీ రూపంలో తీరని అన్యాయం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ని వెంటనే రద్దు చేసి చేనేత కార్మికులకు ప్రోత్సాహక పథకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలకే చనిపోయిన చేనేత కార్మికునికి రూ. 5 లక్షల బీమా వర్తింపజేయాలని చేనేత కార్మికుని కుటుంబానికి 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని ప్రతి చేనేత కార్మికునికి జాకట్ మొగ్గాలు కొనుగోలు చేయడానికి 5 లక్షల రూపాయలు రుణాలు మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీఎస్టీని జియో ట్యాగు ను తొలగించి చేనేత కార్మికులకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చేనేత పనిచేసిన కార్మికులకు పద్మశాలీలకు నీలకంఠ కులాల కు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేసి వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు. రాబోయే కేంద్ర బడ్జెట్లో చేనేత కు 50 000 వేల కోట్లు రూపాయలు బడ్జెట్ ను కేటాయించి దేశవ్యాప్తంగా చేనేత కార్మికులకు అండగా నిలవాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో 5000 వేల కోట్ల రూపాయలు కేటాయించి నిధులు మంజూరు చేసి చేనేత కార్మికులకు చేనేత సంఘాలకు క్యాష్ క్రెడిట్ లను మంజూరు చేసి ఉపాధి కల్పించి వారు తయారు చేసిన బట్టలు కొనుగోలు చేసి వెంట వెంటనే సంఘాలకు డబ్బులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రతినిధులు రాపోలు జగన్, వనం శాంత కుమార్, బాసబత్తిని రాజేశం, గడ్డం వెంకటేశ్వర్లు, గవ్వల శంకర్, చెరకు స్వామి, కర్నాటి మనోహర్, వాల్యాల్ రమేష్, కూరపాటి యాదగిరి, నీలకంఠ ప్రసాద్ ,పాషికంటి లక్ష్మి నర్సయ్య పాల్గొన్నారు.

# బోనమెత్తిన లష్కర్ వారం

మొదటి పేజీ తరువాయి..

మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లారు.మల్లన్న స్వామి. మామ్మేలు స్వామి అంటూ భక్తుల నామస్మరణతో విజయచాల గుట్ట మల్లన్న ఆలయ ప్రాంగణం మారుమోగింది. మల్లన్న స్వామికి మొక్కుబడిగా మొక్కుకున్న భక్తులు ముఖ మండపంలో గంగరేణి చెట్టు కింద, అలాగే చేలుక పాట్నాలు వేసి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు.





మల్లన్నకు అక్కగా భావించే భక్తులు శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి మట్టి పాత్రలతో తయారుచేసిన కుండల్లో నైవేద్యం వండి, బోనం అలంకరించుకొని శివశక్తుల సింధులతో, ఒగ్గు డోలు, చాప్పుల్లతో అమ్మవారి చేంతకు చేరుకొని. కాల్లు శాఖలు పోసి నైవేద్యాన్ని సమర్పించి తమ కుటుంబాలు, పిల్లా పాపలు, గోడ్డు గోధులు చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అయితే, దర్శనానికి వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర య్యాయి. పార్కింగ్ ప్రదేశాలు, రోడ్లపై డ్రైనేజీ నుంచి ప్రవహిస్తున్న మురికి నీటిని తొక్కుకుంటూ స్వామి దర్శనానికి వెళ్లాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నిలపాలన్నా, అక్కడ బాస చేయాలన్నా మురికి నీటి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు.ఎంతో భక్తి శ్రద్ధలతో, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల పట్ల ఆలయ అధికారులు కనీస శ్రద్ధ చూపకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మల్లన్న జాతర వంటి మహత్తర పుణ్యక్షేత్రంలో వసతులు కల్పించడంలో, పరిశుభ్రత పాటించడంలో ఆలయ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# వైభవంగా రథసప్తమి వేడుకలు



## గ్రామ అభివృద్ధికి సహకరిస్తాం



సిద్దిపేట రూరల్, జనవరి 25,(ప్రజాజ్యోతి) : గుర్రాలగొంది గ్రామాభివృద్ధికి తమ వంతు గా సహకారం అందిస్తామని గుర్రాలగొంది ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం రోజున నారాయణరావు పేట మండలం గుర్రాలగొంది గ్రామం లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల కు వాటర్ ప్యూరిఫయర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008 నుండి యూనియన్ నుండి గ్రామానికి సేవలు అందిస్తున్నామని, 2021 కరోనా తర్వాత మళ్లీ యూనియన్ ను కొత్తగా ఏర్పాటు చేశామని గ్రామ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు సహకారం అందిస్తూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, యూనియన్ అధ్యక్షుడు కోల రాజు, గౌరవ అధ్యక్షుడు గోపాలపురం శంకర్, ప్రధాన కార్యదర్శి మట్టే వెంకట్ రెడ్డి , సభ్యులు రాజేశం, హరిదాస్, శివయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ



సిద్దిపేట రూరల్, జనవరి 25, (ప్రజాజ్యోతి): క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు.సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీలకు ఎంపికలు సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు లో రెండు రోజుల పాటు నిర్వహించారు.ఆదివారం కార్యక్రమానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైక్లింగ్ వంటి క్రీడలు యువతకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని, ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువ క్రీడాకారులను సమాజం ప్రోత్సహించాలని, తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ మ్యాక్స్ వెల్ ట్రావర్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య, మార్క రామదాసు గౌడ్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పలువురు బీఆర్ఎస్ లో చేరిక



కొండపాక జనవరి 25( ప్రజా జ్యోతి ):-గ్రామాల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మండిపడ్డారు. హైదరాబాద్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి సమక్షంలో కుకునూరుపల్లి మండలం పిటి వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇనాన్వాస్ సర్పంచ్ దెబ్బేట భాస్కర్తో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి జరిగిందంటే అది కేసీఆర్ నాయకత్వంలోనే జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి గ్రామాల అభివృద్ధిని విస్మరిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు.

## వైభవంగా రథసప్తమి వేడుకలు

సిద్దిపేట, జనవరి 25, (ప్రజా జ్యోతి) :భారతీయ యోగ విద్య నేడు ప్రపంచానికి దిక్సూచిగా మారిందని అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ అన్నారు. సిద్దిపేట కోమటి చెరువు రూబీ నెక్లెస్పై సూర్యదేవునికి సామూహిక సూర్య నమస్కారాలతో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది.ప్రముఖ యోగా గురువు తోట సతీష్, సంధ్యల నేతృత్వంలో ఆదిత్య శ్లోకంతో ప్రారంభమై సూక్ష్మయోగ అనంతరం లయబద్ధంగా సూర్య నమస్కారాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలు, వాకర్స్ సహా అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో వైద్యులు ప్రణీత్ మాట్లాడుతూ యోగా కాలుష్యాన్ని దూరం చేసి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో



నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, విజయ, సాయి, చిప్ప ప్రభాకర్, కొమరవెల్లి అంజయ్య, విక్రం రెడ్డి , మంకాల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవం భారత జాతికి మహా పర్వం



సిద్దిపేట, జనవరి 26:గణతంత్ర దినోత్సవం భారత జా తికి గర్వ కారణమని అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం అన్నారుభారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో స్వతంత్ర భారత జాతీయ పతాకం క్యాన్వాస్ చిత్రాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని కాపాడు కుంటూ ఐక్యత, సహజీవనం, అభివృద్ధి లక్ష్యాల వైపు ప్రతి పౌరుడు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. భారత జెండా




గౌరవాన్ని నిలబెట్టేలా అందరూ ఐక్యంగా ఉం డాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనా రుస్తుం, సాధిక్ మహ్మద్, నహీం రుస్తుం, మహ్మద్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణ



సిద్దిపేట, జనవరి 25, (ప్రజాజ్యోతి) : ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్దిపేట టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఐదు నెలల పాటు ఉచిత ఫౌండేషన్ కోర్సు శిక్షణ అందిస్తున్నట్లు మై భారత్, మేర యువ భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి తెలిపారు.డిగ్రీ పూర్తి చేసి వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 30 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసిన వారికి ఫిబ్రవరి 8న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి, మెరిట్ ఆధారంగా వంద మందిని ఎంపిక చేసి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 91822 20112 నంబర్ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ కో ఆర్డినేటర్ డా. శ్రీకాంత్ , యూత్ ప్రోగ్రాం అధికారి కిరణ్ కుమార్, అధ్యాపకులు డా. సువర్ణదేవి, రమశ్రీ, తిరుపతి, లింగమూర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట మున్సిపల్లో బడ్జెట్ దారి మళ్లింపు




సిద్దిపేట, జనవరి 25, (ప్రజాజ్యోతి):సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు ఇష్టారీతిన కేటాయించి దారి మళ్లిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అలకుంట మహేందర్, సాకి ఆనంద్, కౌన్సిలర్ రియాజుద్దీన్ ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్తో కలిసి వారు మాట్లాడారు.ప్రైవేట్ సంఘాలకు భారీగా మిగులు బడ్జెట్ కేటాయించడం అన్యాయమని, ప్రారంభం కాని పనులకు కూడా నిధులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కాలనీల్లో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కొందరి వ్యవసాయ క్షేత్రాలకు రోడ్లు వేయడం ప్రజాధన దుర్వినియోగమన్నారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయని, కమిషనర్ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ ఫండ్ను 43 వార్డుల అభివృద్ధికి వినియోగించాల్సిందని, కొన్ని సంఘాలకు మాత్రమే నిధులు కేటాయించడం వివక్షకు నిదర్శనమని సాకి ఆనంద్ విమర్శించారు. దళితులు, మైనారిటీలను నిర్లక్ష్యం చేస్తున్నారని కౌన్సిలర్ రియాజ్ మండిపడ్డారు. అన్ని వార్డులకు సమానంగా నిధులు ఇవ్వాలని వారు కోరారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే కీలకం




సిద్దిపేట, జనవరి 25,( ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని మై భారత్, మేర యువ భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మై భారత్, మేర యువ భారత్ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముస్తాబాద్ చౌరస్తా నుంచి బాలుర హై స్కూల్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు ఓటు ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండగానే ప్రతి యువకుడు ఓటరు నమోదు చేసుకోవాలని, సరైన నాయకుడిని ఎన్నుకోవడంలో ఓటే ఆయుధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, హాస్టల్ వార్డెన్లు శ్రీనివాస్, సత్యం, డాక్టర్ శ్రీకాంత్, యువజన ప్రతినిధులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# మల్లన్నను దర్శించుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే

కొమురవెల్లి, జనవరి 25 (ప్రజా జ్యోతి):ప్రఖ్యాతగాంచిన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి ప్రత్యేక పూజలు





నిర్వహించి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్నను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మల్లికార్జున స్వామి దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కొమురవెల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఆంజనేయులు, ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీను, శివలింగం రమేష్ గౌడ్, గొల్లపల్లి కిష్టయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఉంటా

### ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి

చిన్నకోడూరు,జనవరి25,(ప్రజా జ్యోతి): అధైర్యపడొద్దు ఆపద సమయం లో తాను ఎప్పుడు అండగా ఉంటానని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన ఆరుట్ల మల్లయ్య ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి





ఐదువేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన పంపరి లక్ష్మణ్ కు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. సహాయం చేయడంలో తాను ఎప్పుడు ముందుంటానని తెలుపుతూ ప్రజలందరు సంతోషంగా ఉండాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.ఆయన వెంట కుండె తిరుపతి,లింగం, మహేష్,అశోక్ తదితరులున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యతివ్వాలి

### జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిన నర్సింలు

రాయపోల్, జనవరి 25 (ప్రజా జ్యోతి): జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత జాతి ప్రగతికి సోపానం అని అందుకే మున్సిపల్ ఎన్నికల్లో అధిక ప్రాధాన్యతివ్వాలని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు పిలుపునిచ్చారు మన దేశంలో యువత శాతం పెరుగుతోంది. ప్రపంచములో అత్యంత ఎక్కువ మంది యువత ఉన్న దేశంగా భారత్ నిలిచిందని. దేశ అభివృద్ధిలో ఈ యువ మానవ వనరు కీలక పాత్ర పోషిస్తుందని . కేవలం వారిని ఆర్థిక లేదా ఉత్పత్తి రంగంలోనే కాకుండా ఎంతో ప్రాముఖ్యం ఉన్న రాజకీయాల్లోనూ యువతకు తగిన స్థానం కల్పించవలసి ఉందని అప్పుడే నిజమైన నవ సమాజ నిర్మాణం సాధ్యమ వుతుందన్నారు ప్రస్తుతం విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు అనేక పార్టీలకు అనుబంధంగా ఉంటున్నాయి. వీటి నుంచే చాలా రాజకీయ పార్టీలకు నాయకులు లభించిన, లభిస్తున్న సంగతి తెలిసిందే. కేవలం ఆయా సంఘాలలో పనిచేసేవారికే కాకచురుకుగా పని చేయ గలిగిన సామాజిక స్పృహ ఉన్న యువతనంతా అన్ని రాజకీయ పక్షాలూ ప్రోత్సహించాలని. ఎన్ని కల సమయంలోనో... లేదా



ఏవో కొన్ని ఉద్య మాల సందర్భంగానో యువతను, వారి ఆవేశాన్నీ వాడుకుని వదిలేస్తుండటం రాజకీయ పక్షాల్లో కనిపిస్తున్న ట్రెండ్. ఈ ధోరణిని రాజకీయ పార్టీలు విడనాడాలని కోరారు రాజకీయ పార్టీలు యువతకు అన్ని స్థాయుల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి. మొన్నజరిగిన గ్రామ సర్పంచ్ లు వార్డు మెంబర్లు అత్యధికంగా యువత గెలిచి సత్తాచాటారని వార్డు మెంబర్ నుండి అత్యున్నత పార్లమెంట్ సభ్యుని వరకూ వారికి అవకాశం ఇవ్వాలని . యువతీ యువకులు భవిష్యత్ రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రజా ప్రతి నిధులుగా ఎదగడానికి శిక్షణా ప్రాంగణాలుగా స్థానిక సంస్థలు మున్సిపల్ ఎన్నికలు ఉపయోగపడతాయన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో యువతీ యువకులకు అవకాశం ఇచ్చి గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలను ప్రజలను కోరారు

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### డిసిసిబి మాజీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి



ములుగు,జనవరి 25 (ప్రజా జ్యోతి) చదువుతోపాటు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి రాణించాలని డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ రాష్ట్ర కోఆర్డినేటర్ చిట్యాల రాజేశ్వరరావు పేర్కొన్నారు. డిసిసిబి మాజీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోఆర్డినేటర్ చెప్పేలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ములుగు మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో మొక్కలు నాటి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని నింపాలని,క్రీడల తో శారీరక మానసిక ఉల్లాసం ఉండాలంటే క్రీడల్లో చురుగ్గా పాల్గొని ముందు ఉండాలన్నారు.గ్రీన్ ఇండియా చాలెంజ్ లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని సూచించారు. ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మహా యజ్ఞంలో ముందుకు తీసుకెళుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ 2026 క్యాలెండర్లను గర్రెపల్లి సతీష్ క్రీడాకారులకు అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్,అనిల్ మొగిలి,మహేష్,జుబేర్ పాష తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



మిరుదొడ్డి, జనవరి 25, (ప్రజా జ్యోతి) : మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన కుమార చారి అతని కుమారుడు సుశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసింది. బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన రామరాజు మురళి ఆదివారం తన వంతుగా 50 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో కుమార చారి, సుశాంత్ మరణించడం బాధాకరమన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నరేష్, యాదగిరి పాల్గొన్నారు.

## గాడిపల్లి అరుణారెడ్డికి తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారం



సిద్దిపేట అర్బన్, జనవరి 25, (ప్రజాజ్యోతి): సిద్ధిపేటకు చెందిన సామాజిక సేవకురాలు గాడిపల్లి అరుణారెడ్డి తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారాన్ని ఎంపికై ఆదివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్క్లబ్లో కాలోజీ స్మారక సంస్థ, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా అరుణారెడ్డి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, మహిళా చైతన్య ఉద్యమాలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేతుల మీదుగా నంది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇది నా జీవితంలో తొలి మెట్టు విజయంగా భావిస్తున్నానన్నారు. సమాజానికి మరింత సేవ చేయాలనే ప్రేరణ ఈ పురస్కారం ఇచ్చిందనీ. నాకు అవార్డు వస్తుందని ఊహించలేదన్నారు. నా సేవలను గుర్తించి నంది పురస్కారం అందించిన కాలోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సంస్థలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యం

### వడ్డేపల్లి గ్రామంలో స్వచ్ భరత్ కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్ రాజా గారి రేణుక రాజా గౌడ్



రాయపోల్, జనవరి 25 (ప్రజా జ్యోతి):ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రాజా గారి రేణుక రాజా గౌడ్ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆది వారం గ్రామంలో విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీల వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ రేణుక మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామమే అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి ప్రభుత్వంతో మాత్రమే సాధ్యం కాదని, ప్రతి గ్రామస్థుడు బాధ్యతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి ముందు చెత్త వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే చెత్తను వేయాలని సూచించారు. స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్య సమస్యలు దూరమవుతా యని, గ్రామం మరింత అందంగా తీర్చిదిద్దబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సునంద, సి.ఏ. శోభతో పాటు పంచాయతీ



సభ్యులు, పారిశుధ్య కార్మికులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ప్రగతికి సోపానాలు మహిళా సంఘాలు



## ఏపీఎం లక్ష్మి నర్సమ్మ

మిరుదొడ్డి,జనవరి 25, (ప్రజా జ్యోతి): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ఏపీఎం లక్ష్మి నర్సమ్మ అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో సీఆర్పీల సమక్షంలో మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు, వడ్డీలేని రుణాలు, పీఎంఎస్త్వ మైక్రో ఎంటర్ప్రైజెస్, స్త్రీనిధి వంటి పథకాల ద్వారా వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే జెండర్ అవగాహన ద్వారా సామాజిక సమస్యలను అధిగమించవచ్చని సూచించారు.ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌతమి, కార్యదర్శి నవనీతతో పాటు వివిధ గ్రామాల



మహిళా సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తొలిసారిగా ఏవి ఫిస్టులా సర్జరీలు

### సురభి ఆసుపత్రిలో వైద్యుల ఘన విజయం



సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ప్రజాజ్యోతి):సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులోని సురభి మెడికల్ కాలేజీ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద జిల్లాలోనే తొలిసారిగా ఏవి ఫిస్టులా సర్జరీలను విజయవంతంగా నిర్వహించి వైద్యులు మరో మైలురాయిని అధిగమించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీప్తి రావు మాట్లాడుతూ, డయాలసిస్ అవసరం ఉన్న రోగులకు అత్యంత కీలకమైన ఏవి ఫిస్టులా సర్జరీలను నాలుగు మందికి సక్సెస్గా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సర్జరీలతో రోగులకు మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు.సురభి ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలతో పాటు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, నిరుపేద రోగులకు కూడా ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందిస్తు న్నా మని తెలిపారు. చింతమడక గ్రామం, దుబ్బాక మండలం ఎనకుర్తి, చిన్నకోడూరు మండలం చిన్నకోడూరు, రామంచ గ్రామాలకు చెందిన పేద రోగులకు ఈ సర్జరీలు నిర్వహించినట్లు ఆమె వివరించారు.ఈ సర్జరీలను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య బృందానికి రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోనే తొలిసారిగా ఈ విధమైన సర్జరీలు జరగడం వల్ల బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని వారు తెలిపారు.

## రాజకీయాల్లో గెలుపు-ఓటములు సహజమే



సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ప్రజాజ్యోతి):రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజ ప్రక్రియేనని సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ముదిరాజ్ సంఘం నాయకులు కొత్త ఎల్లం, కొత్త శ్రీకాంత్లు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి చెందిన గ్రామ వార్డు సభ్యులకు ఆదివారం గ్రామ పెద్దమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణంగా గెలిచిన అభ్యర్థులకే సన్మానాలు జరుగుతాయని, అయితే ఓడిన వారిని కూడా గౌరవించి మనోధైర్యాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాసేవే ప్రధాన లక్ష్యమని, ఓటమితో నిరుత్సాహపడకుండా మరింత ఉత్సాహంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అభ్యర్థులను ప్రోత్సహించారు.

# ఓటు హక్కు ఒక వజ్రాయుధం

### ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే కీలకం
### ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం
### తాహసిల్దార్ సంజయ్ కుమార్

దుబ్బాక, జనవరి 25,( ప్రజాజ్యోతి): ఓటు హక్కు ఒక వజ్రాయుధం లాంటిదనిప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని దుబ్బాక తహసిల్దార్ సంజయ్ కుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులతో ఓటరు






అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు ఓటు ప్రాముఖ్యతపై నినాదాలు చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండగానే ప్రతి యువకుడు ఓటరు నమోదు చేసుకోవాలని, సరైన నాయకుడిని ఎన్నుకోవడంలో ఓటే ఆయుధమని తెలిపారు. అనంతరం ఓటర్ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన ర్యాలీ






రాయపోల్ జనవరి 25 (ప్రజా జ్యోతి): రాయపోల్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కృష్ణ మోహన్ గ్రామ సర్పంచ్ మాసన్ పల్లి రాజు ఆధ్వర్యంలో ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం




సందర్భంగా , అధికారులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వయోజనులకు ఓటర్ కార్డులను పంపిణీ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తాసిల్దార్ కృష్ణమోహన్ అన్నారు ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు.

# తనతో పాటు చదువుకున్న తోటి స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన స్నేహితులు

రాయపోల్, జనవరి 25( ప్రజా జ్యోతి): ఆరేపల్లిలో మానవత్వానికి నిదర్శనంగా నిలిచి స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు పూర్వ స్నేహితులు. రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో రెడ్డిమైన రాజు మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబాన్ని 2009 – 2010 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు రెడ్డమైన రాజు కుటుం బాన్ని పరామర్శించి రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేపల్లి గ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రుడు రెడ్డమైన రాజు ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న రాజు అకాల మరణంతో వారి కుటుంబం తీరని దుఃఖంలో మునిగిపోయింది. ఈ విషాదకర పరిస్థితిని తెలుసుకున్న 2009–2010 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న రాజు సహచరులు మానవత్వంతో స్పందించారు.పదవ తరగతి స్నేహితులందరూ కలిసి రాజు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్టకాలంలో తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమ చిన్ననాటి మిత్రుడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, కుటుంబానికి ఆర్థిక భరోసాగా రూ.40 వేల నగదును అందజేశారు.స్నేహబంధం ఎప్పటికీ చెరిగిపోదని, చదువు పూర్తయ్యి సంవత్సరాలు గడిచినా ఆపదలో ఉన్న మిత్రుని కుటుంబానికి సహాయం చేయడం తమ బాధ్యతగా భావించినట్లు



వారు తెలిపారు. ఇలాంటి సహాయ కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, యువతలో సామాజిక స్పృహను పెంపొందిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా మానవత్వం, స్నేహం, సహకారం వంటి విలువలు ఇప్పటికీ బతికే ఉన్నాయని స్పష్టమైందని గ్రామస్తులు ప్రశంసించారు. ఆరేపల్లిలో జరిగిన ఈ సంఘటన సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.

# యువ జోష్

## గ్రామాల ముఖచిత్రం మారుస్తున్న యువ సర్పంచ్లు





సిద్దిపేట, జనవరి 25, (ప్రజా జ్యోతి): యువత రాజకీయాల్లోకి వస్తే గ్రామాలు బాగుపడతాయనే మాటకు నేడు సిద్దిపేట జిల్లాలోని యువ సర్పంచ్లు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నారు. కొత్త ఆలోచనలు, సేవాభావం, యువ జోష్తో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన యువ నాయకులు గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా చేసుకొని ముందుకెళ్తూ ప్రజలకు ఆశాకిరణంగా మారుతున్నారు. చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ, స్వగ్రామ సేవే ధ్యేయంగా పెట్టుకొని పలువురు యువకులు ప్రజాప్రతినిధులుగా మారారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి కొరత, దెబ్బతిన్న రహదారులు, పారిశుధ్య లోపాలు, యువతకు ఉపాధి అవకాశాల లేమి వంటి సమస్యలను దగ్గరగా గమనించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపాలనే సంకల్పంతో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల విశ్వాసం పొందారు.సర్పంచ్గా బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యాలయాల్లో పరిమితం కాకుండా గ్రామంలోని ప్రతి వీధి, కాలనీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుం టున్నారు. తాగునీటి కోసం కొత్త ట్యాంకుల ఏర్పాటు, పైప్లైన్ల మరమ్మతులు, పాడైన సీసీ రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం వంటి పనులను వేగంగా చేపడుతున్నారు. అలాగే పాఠశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. యువతకు సరైన దిశ చూపాలనే ఉద్దేశంతో స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, క్రీడా మైదానాల ఏర్పాటు, సాంస్క ృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. గ్రామాల్లో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సమగ్ర గ్రామాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రజ లకు





ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్య వచ్చిన వెంటనే స్పందించడం యువ సర్పంచ్ల ప్రత్యేకతగా మారింది నారాయణరా వుపేట మండలం గుర్రాలగొంది గ్రామానికి ఆకుల స్వప్న సర్పంచ్గా ఎన్నికైన అనంతరం గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రతివారం శ్రమదానం కార్యక్రమాలు, యువతకు చెడు వ్యసనాలపై అవగాహన సదస్సులు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్, ఆమె భర్త ఇద్దరూ పట్టభద్రులు కావడంతో గ్రామానికి అవసరమైన పనులపై అధికారులతో నేరుగా సమన్వయం చేసుకుంటూ వేగంగా పరిష్కా రాలు సాధిస్తున్నారు.ఆకుల హరీష్ గతంలో ఎంపీటీసీ గా బాధ్యతలు నిర్వ హించడంతో రాజకీయ అనుభవ ఉండి గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారు. నూతన గ్రామ పంచాయతీ అయిన చిన్నకోడూరు మండలం శంకరాయ కుంట గ్రామానికి ప్రైవేట్ అధ్యాపకుడైన మాకు మహేష్ సర్పంచ్గా ఎన్నికై తొలి రోజు నుంచే అభివృద్ధిపై దృష్టి పెట్టారు. గ్రామ యువత సహకారంతో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల





తొలగింపు, శిథిలావస్థలో ఉన్న ఇళ్ల కూల్చివేత వంటి పనులను చేపట్టి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు.యువత రాజకీయాల్లోకి వస్తే గ్రామాల ముఖచిత్రం మారుతుందనే నానుడికి సిద్దిపేట జిల్లాలోని యువ సర్పంచ్లు నేడు సజీవ ఉదాహరణలుగా నిలుస్తూ, గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారు. గ్రామస్తుల నమ్మకాన్ని నిలబడత ఆకుల స్వప్న హరీష్, సర్పంచ్గుర్రాలగొంది గ్రామంగ్రామస్తుల నమ్మకంగా సర్పంచ్ గా గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధి కి కృషి చేస్తా. యువతకు ఉద్యోగ కల్పన, ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తా.గ్రామాభివృద్ధి కీ పాటుపడతా మాకు మహేష్, శంకరాయకుంట గ్రామ సర్పంచ్ మాది నూతన గ్రామ పంచాయతీ, గ్రామస్తులు ఎంతో నమ్మకంతో సర్పంచ్ గా గెలిపించారు. గ్రామ యువకుల సహకారంతో ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టాం.

# జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో అవగాహన




హుస్నాబాద్, జనవరి 25 (ప్రజా జ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆర్డీవో రామ్మూర్తి, ఎసిపి సదానందం, అధికారులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వయోజనులకు ఓటర్ కార్డులను పంపిణీ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఆర్డీవో రామ్మూర్తి తెలిపారు. ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు.





# పుస్తెల తాడు దొంగతనం చేసిన నిందితుడు రిమాండ్

హుస్నాబాద్, జనవరి 25 (ప్రజా జ్యోతి):ఒంటరిగా ఉంటున్న మహిళ మెడలో నుండి పుస్తెలతాడు దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆరేపల్లి గ్రామానికి చెందిన బాధితురాలు గడిపే స్వప్న ఈనెల 11న ఆమె వంటింట్లో ఉండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుండి ఇంట్లోకి చొరబడిన ఆమెను పట్టుకోగా బాధితురాలు తేరుకుని వెనక్కి తిరిగి చూడగా ఆ వ్యక్తి తన ముఖం గుర్తుపట్టకుండా మాస్క్ ధరించి, చేతులకు గ్లౌజులు వేసుకుని ఉన్నాడని తెలిపారు. అతను ఒక్కసారిగా బాధితురాలి మెడలో ఉన్న సుమారు 2.5 తులాల బంగారు గొలుసును బలంగా లాక్కొని అక్కడి నుండి పరారయ్యాడని తెలిపారు. ఈ క్రమంలో బాధితురాలి మెడకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగ హుస్నాబాద్ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పూదరి శివ అని గుర్తించి రిమాండ్ చేయడం జరిగినదని తెలిపారు. నిందితుడి దగ్గర మొత్తం 50 వేల నగదు, 60 వేల విలువగల కొత్త ఒప్పో ఫోన్, రియల్ మీ ఫోన్, పావు తుల పుస్తెలు, 25 గ్రాముల బంగారం లోన్ పెట్టిన బ్యాంకు రిసిప్ట్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ లక్ష్మి రెడ్డి తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన క్రైమ్ కానిస్టేబుల్ నరేష్ ను హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అభినందించారు.